మిషన్ భగీరథ నుంచి మురుగు నీరు

మిషన్ భగీరథ నల్లాలో వచ్చిన మురుగు నీరు

దామరగిద్ద, జూలై 29: మండల కేంద్రంతో పాటు బాపన్‌పల్లి, క్యాతన్‌పల్లి, వత్తుగుండ్ల గ్రామాల్లో సోమవారం మిషన్ భగీరథ నల్లాలో మురుగునీరు సరఫరా అయ్యింది. వత్తుగుండ్లలో గల మిషన్ భగీరథ నీటి నిల్వ ట్యాంకును శనివారం కడిగిన తర్వాత నీటిని బయటికి వదలాల్సి ఉండగా, వివిధ గ్రామాలకు వెళ్లే పైపులైన్ ద్వారా గ్రామాలకు సరఫరా అయ్యింది. దీంతో ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రంలోని ట్యాంకులను సోమవారం శుభ్రం చేయించామని మంగళవారం నుంచి శుభ్రమైన నీటిని వదులుతామని గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి తెలిపారు.

మట్టితొలగింపు పనులు షురూ

కోనేరులో ఉన్న మట్టిని తొలగిస్తున్న ఇటాచి వాహనం

జడ్చర్ల, జూలై 29: శ్రావణమాసం దగ్గర పడుతుండటంతో జడ్చర్ల మున్సిపాలిటీలోని పెద్దగుట్టపై వెలసిన రంగనాయకస్వామి ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో చేపట్టే చదును చేసే పనులను ఆలయ పరిరక్షణకమిటీ అధ్యక్షుడు రాంరెడ్డి ప్రారంభించారు. మిగిలిపోయినమట్టిని తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. ఆలయానికి రంగులు వేయడం, గుట్టపైకి మెట్ల మార్గాన్ని చదునుచేసి, మెట్లపై పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మలను తొలగించనున్నారు.

రోడ్లపై పశువులను గోశాలకు తరలిస్తాం

టీచర్స్‌కాలనీ పార్కులో మున్సిపల్ అధికారులు కట్టడి చేసిన పశువులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జూలై 29: మహబూబ్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలిగిస్తూ.. ట్రాఫిక్‌కు అడ్డుగా ఉండే పశువులను గోశాలకు తరలించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వాహనాలకు అడ్డుగా ఉన్న పశువులను మున్సిపల్ సిబ్బంది టీచర్స్‌కాలనీలోని పార్కుకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇదివరకే పశువుల యజమానులను హెచ్చరించడంతో పాటు నోటీసులు జారీ చేశామని, పశువులను కట్టడి చేసుకోవాలని సూచించామన్నారు. ఈ విషయాన్ని కొందరు పెడచెవిన పెడుతుండటంతో పశువులను గోశాలకు తరలించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు.

అండర్‌బ్రిడ్జీల కింద నిలిచిన నీరు

పెద్దచింతకుంట వెళ్లే దారిలో రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వర్షం నీరు

మరికల్, జూలై 29: రైల్వే అండర్‌బ్రిడ్జీల కింద వర్షపు నీరు నిలిచి పలుగ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దచింతకుంట, ఇబ్రహీంపట్నం, బుడ్డెగాని తండా ప్రజలు తమ గ్రామాలకు రాకపోకలు చేసేందుకు రైల్వేబ్రిడ్జీ కింది నుంచి వెళ్లాలి. గుంతలు పెట్టి రైల్వే ట్రాక్ నిర్మాణం చేయడం వల్ల కాస్త వర్షం వచ్చినా బాటసారులు నడవలేని పరిస్థితి ఏర్పడింది. నీళ్లు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సినారేకు ఘన నివాళి

సినారే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చిన్నారులు

జడ్చర్ల, జూలై 29: తెలుగు కవి, సాహితీవేత్త డాక్టర్. సి.నారాయణరెడ్డి జయంతి వేడుకలను సోమవారం జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. సంస్కారభారతి ఆధ్వర్యంలో జడ్చర్లలోని అనురాగిణి అనాథాశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినారే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్‌పాల్‌రెడ్డి మాట్లాడుతూ రచనలతో పాటు తెలుగు సాహిత్య రంగానికి నారాయణరెడ్డి చేసిన కృషి ఎప్పటికీ మరిచిపోలేనిదన్నారు.

ఘనంగా కౌడి పీర్ల సవారి

ధన్వాడలో కౌడిపీర్ల సవారీ

ధన్వాడ, జూలై 29: మండల కేంద్రంలోని కంచుకోట వీధిలోని మసీద్‌లో ఏర్పాటు చేసిన కౌడి పీర్ల సవారీని సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఎండుతున్న చివరి ఆయకట్టు

- సంగంబండ సాగునీటి కాల్వల్లో అడ్డంగా పెరిగిన గడ్డి
- కాల్వ నిర్వహణను పట్టించుకోని అధికారులు
- ఎమ్మెల్యే చెప్పినా పెడచెవిన పెట్టిన వైనం

సాగునీరు లేక బీటలుబారిన వైనం

మాగనూరు, జూలై 29 : మండల పరిధిలోని నేరడగం సంగంబండ రిజర్వాయర్ కింది ఆయకట్టుకు సాగునీరందక ఎండిపోతున్నదని మాగనూర్, కృష్ణ మండలాల్లోని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడమ, కుడి లోలెవెల్ కాల్వల్లో 20 కిలోమీటర్ల పొడవునా మట్టి పూడుకుపోయిందని, పిచ్చి మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగిందని తెలిపారు. దీనివల్ల చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదన్నారు. కుడి కాల్వ కింద సుమారుగా 18,400 ఎకరాల ఆయకట్టు, ఎడమకాల్వకింద దాదాపు 15,900 ఎకరాల ఆయకట్టు సాగవుతున్నదని, అధికారుల నిర్లక్ష్యం వల్ల కాల్వల నిర్వహణ పట్టించుకునే వారు కరువయ్యారని, కాల్వలకు పలుచోట్ల గండ్లు కూడా పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం రైతులు తెలిపినా పట్టించుకోవడం లేదని తెలిపారు. మాగనూర్‌కు చెందిన వాకిటి వాభిదాదాపు 26 ఎకరాలు వరి పంట సాగు చేస్తున్నాడు. ఎకరాకు రూ.80వేలు ఖర్చు చేశానని, సాగునీరు అందక ఇప్పటికే 16ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని తెలిపాడు. ఇదే కాల్వల విషయమై గత నెలలో సంగంబండ ఎడమ కాల్వను మక్తల్ ఎమ్మెల్యే పరిశీలించడానికి వెళ్లడంతో రెండు మండలాల రైతులు కాల్వల దుస్థితి, నిర్వహణలో జాప్యాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్యను నేరుగా ఇరిగేషన్ జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఇబ్బందులను వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలని చెప్పారు. నెల రోజులు గడిచినా ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదని, కనీసం పరిశీలించలేదని రైతులు వాపోతున్నారు. ఓ పక్క రైతులు ఉమ్మడి మండల వ్యాప్తంగా వరి పంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. చివరి ఆయకట్టుకు సాగునీరు లేక కొందరు కరెంటుపై ఆధారపడి పడిగాపులు కాస్తున్నారు. ఇంకొందరు కాల్వ వెంబడి దాదాపు 50 మంది వరకు 5హెచ్‌పీ మోటర్లు పెట్టి తోడేస్తుండడంతో కాల్వకు వదిలిన నీరు వర్కుర్ గ్రామం వరకు కూడా రావడంలేదని రైతులు తెలిపారు.

కాల్వ నీరే మాకు దిక్కు

పది ఎకరాల్లో వరిపంట వేశాను. కానీ సాగునీరు లేక ఇబ్బందిపడుతున్న. కాల్వ నుంచి వచ్చే నీళ్లే మాకుదిక్కు. అవి రాకపోతే మా పంట చేతికిరాదు. ఇప్పటికే చాలా వరకు పంటలు నీళ్లందక ఎండిపోతున్నాయి. కాల్వల్లో పూడిక, గడ్డి తొలగిస్తేనే మా పంటలకు నీళ్లందుతాయి. అధికారులు వెంటనే పొలాలకు నీళ్లందేలా చర్యలుతీసుకొని, పంటలను కాపాడాలి.

-బ్యాగరి మధు, రైతు, మాగనూర్

నేడు రెండోవిడత రుణమాఫీ

- **మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి**

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 29: పంట రుణమాఫీలో భాగంగా రెండోవిడత రుణమాఫీ కార్యక్రమాన్ని ఈ నెల 30న మధ్యాహ్నం 12గంటలకు మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం వెబ్‌ఎక్స్ ద్వారా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావుతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించే కార్యక్రమానికి ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన రైతులు హాజరయ్యేలా వ్యవసాయశాఖ అధికారులు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

మండలాల్లో రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించేందుకు ఏర్పాటు చేయాలని, బ్యాంకర్లకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్, జిల్లా సహకార అధికారిపద్మ, లీడ్ బ్యాంకు మేనేజర్ కల్వ భాస్కర్, ఇతర ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

వేధింపులకు గురైతే పోలీసులను సంప్రదించాలి

- **ఎస్పీ యోగేశ్ గౌతమ్**

నారాయణపేట, జూలై 29: మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వేధింపులకు గురైతే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడవద్దని, గృహహింసకు గురైనా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినులు బస్టాండ్లు, గ్రామాల్లో, కాలనీల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు గురైనా, ఉద్యోగ మహిళలు పనిచేసే ప్రదేశంలో వేధింపులకు గురైనా, బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే షీ టీమ్ పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. మహిళలు సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వాటిలో ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే ముందు వ్యక్తి గత భద్రతకు సంబంధించి అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా నేరుగా సంప్రదించలేని వారు సెల్‌నెంబర్ 87126 70398కు లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

నిందితులను ప్రోత్సహించిన వారిని శిక్షించాలి

మక్తల్, జూలై 29: మక్తల్ పట్టణంలో వినాయక విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను ప్రోత్సహించిన వారిపై కేసు నమోదు చేయాలని సోమవారం నారాయణపేటలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేశ్ గౌతమ్‌కు మక్తల్ హిందూ ధార్మిక సంస్థల నాయకులు వినతిపత్రం అందజేశారు. కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఏబీవీపీ, బీజేవైఎం, హిందూ ధార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అయోధ్యనగర్ కాలనీలో చోరీ

జడ్చర్ల, జూలై 29: జడ్చర్ల మున్సిపాలిటీలోని అయోధ్యనగర్‌కాలనీలో నివసిస్తున్న ప్రవీణ్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ప్రవీణ్‌రెడ్డి శనివారం బోనాల పండగకు రంగారెడ్డిజిల్లా కొత్తూరు మండలం రంగాపూరం వెళ్లారని, సోమవారం ఉదయం ఇంటికి తిరిగి రాగా, తాళం తీసి ఉండటం గమనించాడు. లోపలకు వెళ్లి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందగా పడి ఉన్నాయి. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లోని 5తులాల బంగారం, 30తులాల వెండి, రూ.20వేలు నగదు చోరీ అయ్యాయని తెలిపాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ దొంగ?

బాలానగర్, జూలై 29; సెల్‌ఫోన్లు దొంగిలించినట్లు అనుమానిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మండలంలోని ఉడిత్యాల శివారులో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న యాదయ్య అనే వ్యక్తిని కొట్టి యాదయ్య సెలఫోన్‌ను, సబ్‌స్టేషన్‌కు సంబంధించిన సెల్‌ఫోన్‌ను తీసుకుని పారిపోయాడు. సూరారం గ్రామంలో యాదయ్య బావ మరదులు గుర్తు తెలియని వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడిని కేశంపేట మండలం చౌలపల్లి గ్రామానికి చెందిన మహేశ్‌గా పోలీసులు గుర్తించి విచారణ చేస్తున్నారు.

మూర్ఛవ్యాధితో కింద పడి వ్యక్తి మృతి

నవాబ్‌పేట, జూలై 29: మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన మాసయ్య(50) మూర్ఛవ్యాధితో కింద పడి మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆ వివరాలు.. రుద్రారం గ్రామానికి చెందిన మాసయ్య కొంతకాలం నుంచి మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. గత ఆదివారం రాత్రి ఇంటినుంచి తన వ్యవసాయ పొలానికి నడుచుకుంటూ వెళ్తూ.. కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మాసయ్య కుమారుడు లింగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

సీసీ కెమెరాలతో ఎంతో ఉపయోగం

జడ్చర్ల, జూలై 29: జడ్చర్ల మున్సిపాలిటీలోని విద్యానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి ప్రారంభించారు. విద్యానగర్ కాలనీకి చెందిన హుస్నాబాద్ రాంరెడ్డి, అతని సోదరుడు సూర్యప్రకాశ్‌రెడ్డి రూ.2లక్షల 20 వేలతో తమ సొంతఖర్చులతో కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. వాటిని సోమవారం సీఐ ఆదిరెడ్డి పరిశీలించి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానించారు. ఈ సందర్భంగా సీఐ ఆదిరెడ్డి మాట్లాడుతూ సీసీ కెమెరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలీసులకు సహకరించేందుకు ప్రజలు ముందుకు రావాలని, ఇటీవల పలుకంపెనీలలో ఉద్యోగాల కోసం కొత్తవారు వస్తున్నారని, వారితోపాటే కొందరు నేరస్తులు వస్తున్నారన్నారు. అనుమానితుల కదలికలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించవచ్చన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి

విద్యానగర్ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన కాలనీవాసులు హుస్నాబాద్ రాంరెడ్డి, అతని సోదరుడు సూర్యప్రకాశ్‌రెడ్డిని సీఐ అభినందించారు.

ఘనంగా పండుగ సాయన్న జయంతి

జడ్చర్ల, జూలై 29 : పండగసాయన్న జయంతిని సోమవారం జడ్చర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కావేరమ్మపేట చౌరస్తాలో పండుగసాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కృష్ణానది తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణానదిలో వరద నీరును పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్

కృష్ణ, జూలై 29: కొన్ని రోజులుగా కరాట్టక, మహారాష్ట్రలోభారీ వర్షాలు కురవడంతో కృష్ణానదికి రోజురోజుకూ వరద పెరుగుతున్నది. సోమవారం సీఐ చంద్రశేఖర్ ఎస్సై నవీద్‌తో కలిసి తంగిడి సమీపంలో కృష్ణా, భీమా నదుల వరద ప్రవాహ ఉధృతిని పరిశీలించా రు. అ నంతరం అక్కడ ప్రజలతో మాట్లాడు తూ నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు వాసునగర్, తంగిడిగి, కృష్ణబ్రిడ్జి, దత్తాత్రేయ ఆ లయంతో పాటు అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బోరుమోటరు ప్రారంభం

బోరు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జూలై 29: మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రవల్లి, పిల్లలమర్రితండాలో హైమాస్ట్ లైట్లను, ఏనుగొండ ఎస్సీకాలనీలో కొత్తగా వేసిన బోరును మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. 21 వ వార్డు శేషాద్రినగర్‌లోని పలుప్రాంతాల్లో పర్యటించి, రోడ్లు సక్రమంగా లేకపోవడం తో వాటి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంతకుముందు నాలుగోవార్డు ఎదిరలో బోనమెత్తారు. గ్రామస్తులతో పాటు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

మరిన్నినిధులు కేటాయించాలి

పాలమూరు, జూలై 29: ప్రభుత్వం 2024-25 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.50కోట్ల నిధులు ప్రకటించడం పట్ల పాలమూరు జిల్లా బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి బాధ్యులు గుండాల రాఘవేంద్రశర్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.100కోట్లు కేటాయించగా, కాంగ్రెస్‌ప్రభుత్వం దానిని రూ. 150కోట్లకు పెంచితే బాగుంటుందన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్,జూలై 29 : మండలంలోని పాతమొల్గరకు చెందిన మహేందర్‌గౌడ్‌కు వైద్యసదుపాయం కోసం నీమ్స్ దవాఖానలో చికిత్స పొందేందుకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రూ.లక్షా50 వేల ఎల్‌వోసీని అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే తనఇంట్లో మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి అందజేశారు.

ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలి

అవగాహన కల్పిస్తున్న డా.అబ్దుల్‌రబ్బు

భూత్పూర్, జూలై 29 : సీజన్ మారిన అనంతరం ప్రతి ఒక్కరూ ఓఆర్‌ఎస్ ద్రావణం తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్దుల్‌రబ్బు అన్నారు. సోమవారం ఓఆర్‌ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిఇంటికి ఓఆర్‌ఎస్ ద్రావణం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఆర్‌ఎస్ మనిషి శరీరంలో నీరసం ఉన్న సమయంలో తాగితే శరీరానికి కొంత శక్తిని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కరపత్రం విడుదల

కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

మక్తల్, జూలై 29: వర్గీకరణ పరిష్కారం కోసం తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో హలో మాదిగ.. చలో ఢిల్లీ కార్యక్రమం కరపత్రాన్ని సోమవారం ఉదయం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజ్ మాదిగ ఆధ్వర్యంలో కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో బాలరాజు, ఎలుక బాలరాజు, కర్రెమ్ అంజి, తిరుపతయ్య మొగులప్ప ఉన్నారు.

విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవాలి

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మక్తల్, జూలై 29: విద్యార్థులు శ్రద్ధతో చదివితేనే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతారని మక్తల్ హెడ్ కానిస్టేబుల్ బలరాం అన్నారు. మక్తల్ ఎల్లమ్మకుంట రోడ్డులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం సాయంత్రం ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, గుడ్ టచ్ బ్యాడ్‌టచ్, సైబర్ నేరాలపై, బాల్య వివాహాలు, చదువుపై శ్రద్ధ, సెల్‌ఫోన్ వినియోగంతో అనర్థాలు, బాలకార్మిక వ్యవస్థ, రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మనోహర్, భాను, అధ్యాపక బృందం విద్యార్థినులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

చెక్కు పంపిణీ చేస్తున్న నందూనామాజీ తదితరులు

నారాయణపేట టౌన్, జూలై 29 : సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ ద్వారా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం బీజేపీ లీగల్‌సెల్ కన్వీనర్ నందూనామాజీ ఆయన నివాసంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. దామరగిద్ద మండలం కందెన్‌పల్లికి చెందిన కిష్టమ్మకు రూ.13వేలు, ధన్వాడ మండలానికి చెందిన మణెమ్మకు రూ.17వేలు మంజూరయ్యాయి. అనంతరం మాట్లాడుతూ రిలీఫ్‌ఫండ్ మంజూరుకు సహకరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లాఉపాధ్యక్షుడు సత్యనారాయణయాదవ్, వెంకట్రాములు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం సద్వినియోగం చేసుకోండి

నారాయణపేట టౌన్, జూలై 29: పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో మంగళవారం యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మధు, గణేశ్, వెంకటేశ్, ప్రవీణ్, రవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందన్నారు.

కాడెద్దులు మృతి

మక్తల్, జూలై 29: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి కాడెద్దులు మృతి చెందాయి. ఈ ఘటన మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం లంకాలలో సోమవారం ఉదయం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సంజీవరెడ్డి ఎద్దుల బండితో పొలానికి వెళ్తూ మధ్యలో నీళ్లు తాపించేందుకు చెరువులోకి వెళ్లగా ప్రమాదవశాత్తు ఎద్దులు, బండి చెరువులో మునిగి చనిపోయాయి. రైతును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘర్షణ పడిన ఇద్దరిపై కేసు నమోదు

వివరాలు తెలుసుకుంటున్న టూటౌన్ ఎస్సై ఓబుల్ రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 29: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో జీపు డ్రైవర్, ఆటోడ్రైవర్ ఘర్షణ పడడంతో ఇద్దరిపై కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ ఎజాజ్ అహ్మద్ తెలిపారు. ఆ వివరాలు.. అశోక్ టాకీస్ చౌరస్తాలోని ప్రిన్స్ టెక్స్‌టోరియం వద్ద ప్రధాన రోడ్డుపై సోమవారం జీపుడ్రైవర్ తన వాహనాన్ని ఆపాడు. అక్కడే మజీదులోకి నీళ్లక్యాన్లు తీసుకెళ్లేందుకు వచ్చిన ఆటోడ్రైవర్ జీపును తీయాలని చెప్పడంతో జీపుడ్రైవర్ కుటుంబ సభ్యులతో పాటు ఆటోవ్యక్తికి మధ్య మాటామాట పెరిగింది. ఈ క్రమంలోనే ఆటోడ్రైవర్ దాడి చేయడంతో జీపుడ్రైవర్ గాయపడ్డాడు. ఈ ఘటనపై సెక్షన్ 324 కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.